క్లుప్తంగా

కన్నా మాస్టారుకు సత్కారం



పాత గుంటూరు: నాగార్జున యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అందుకున్న ప్రముఖ కన్నా విద్యాసంస్థల అధినేత కన్నా మాస్టారును గుంటూరు జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. వల్లూరివారి తోటలోని కన్నా మాస్టారు నివాసంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మద్దు వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు వీఎస్ఎన్ మల్లేశ్వరరావు , జేమ్స్ పాండే, డి.బి.బాలస్వామి, కె. బాబూరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జేఆర్‌ఎఫ్‌కి పొలిటికల్ సైన్స్ విద్యార్థి ఎంపిక



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ పొలిటికల్ సైన్స్ రెండో సంవత్సరం విద్యార్థి జి. విలియంకేరి జాతీయ స్థాయిలో జేఆర్‌ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్)కు ఎంపికయ్యాడు. యూజీసీ దేశవ్యాప్తంగా గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన నెట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఫెలోషిప్ సాధించాడు. ఈ సందర్భంగా విలియంకేరిని బుధవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగ అధ్యాపకులు ఆచార్య రవిశేఖర్, డాక్టర్ వి. అంజిరెడ్డి, డాక్టర్ ఉదయప్రకాష్, డాక్టర్ గాలయ్య, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఆశీరత్నం పాల్గొన్నారు.

మహిళా హోంగార్డుకి సత్కారం



నగరంపాలెం: పోలీసు శాఖలో నలభై ఏళ్ల సమర్థంగా విధులు నిర్వహించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. మహిళా హోంగార్డు ఈపూరి మంగమ్మ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెను నగరంపాలెం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఆమె భావి జీవితం సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు రాఘవయ్య, రాజారావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలి



నగరంపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ కోరారు. డివిజన్ పరిధిలోని ఆర్.అగ్రహారం వాసులకు బుధవారం తడి, పొడి చెత్తతోపాటు హానికరమైన వ్యర్థాలపై గడప గడపకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు విడివిడిగా తడి, పొడి చెత్తను అందించాలని చెప్పారు. డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో స్థానికుల సహకారం ఎంతో అవసరమని కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సూపర్‌వైజర్ అంగడి వెంకటేశ్వరరావు, ఐటీసీసీఎస్ఆర్ ప్రతినిధులు శైలజ, జయ, నిఖిత, సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు భర్తీ చేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు శిశు అభివృద్ధి పథకం అధికారి వి.సుజాతదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోస్టర్ ప్రకారం వట్టిచెరుకూరు మండలం వట్టిచెరుకూరు గ్రామంలోని బీసీ సెంటరు ఆయా పోస్టు ఓసీ జనరల్ కేటగిరీకి రిజర్వు అయినట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఆమె సూచించారు. అభ్యర్థినులు 2022 జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు వయస్సుతో పాటు స్థానిక నివాసితురాలై, వివాహిత అయ్యి, ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ప్రత్తిపాడు సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలని సుజాతదేవి తెలిపారు.

భారతీయుల ఉమ్మడి మతం క్రికెట్

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

పట్నంబజారు: యావత్ భారతీయుల ఉమ్మడి మతం క్రికెట్ అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. టాటా ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ – 2023 పేరిట ఈనెల 6, 7 తేదీల్లో గుంటూరు ఎల్ఈఎం స్కూలు గ్రౌండ్‌లో బీసీసీఐ స్వయంగా మెగా డిజిటల్ స్క్రీన్‌పై లైవ్ మ్యాచ్‌ల స్క్రీనింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి అన్నంరాజు సాయిరాం బుధవారం ఎమ్మెల్సీకి ఆహ్వానపత్రికను అందజేశారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ క్రికెట్ పండుగకు గుంటూరు చక్కని వేదిక కాబోతుందన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ అసలైన మజాను ఆస్వాదించాలని అనుకునే గుంటూరు క్రికెట్ ప్రేమికులకు ఇది కచ్చితంగా శుభవార్త అన్నారు. విద్య తర్వాత మన జీవన గమనాన్ని నిర్దేశించగల శక్తి ఒక్క క్రీడలకు మాత్రమే ఉందన్న వాస్తవాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ గుర్తించారు కనుకనే క్రీడారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ క్రీడాకారులుగా రాణించి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి ఉప్పులూరి రామశర్మ, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), జిల్లా ఎన్జీవో సంఘం నేత సుకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు కన్వీనర్లు



కన్వీనర్లను సత్కరిస్తున్న లాలుపురం రాము, కార్పొరేటర్ ఆచారి

పట్నంబజారు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు సచివాలయ కన్వీనర్లు అని జీడీసీసీ బ్యాంకు చైర్మన్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) పేర్కొన్నారు. నగరంలోని 32వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా సచివాలయ కన్వీనర్లు గంగయ్య, పొత్తూరి శ్యామ్, మహేంద్ర గులేచా, నాగార్జున, విజయారెడ్డి, ఐతి శైలజ, శ్రీనివాసరెడ్డి, పాపారావు, డేవిడ్ తదితరుల్ని స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లాలుపురం రాము మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును స్వయంగా పర్యవేక్షించే అనుసంధానకర్తలు కన్వీనర్లు అని తెలిపారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి నేటి వరకు కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అన్ని వర్గాల ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ గడప గడపకు తిరిగి గుండె గుండెను తడిమినట్లు చెప్పారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా తన డివిజన్‌లో ప్రజలతో మమేకమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి, సత్యనారాయణరెడ్డి, ఉల్లిందల ఓబులరెడ్డి, పండ్ల నారాయణ పాల్గొన్నారు.

పీఏలు ఓర్పుగా పని చేయాలి

పాత గుంటూరు: గుంటూరులోని ఓ ఫంక్షన్ హాలులో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఓఎస్డీలు, పీఎస్‌లు, అడిషనల్ పీఎస్‌లు, పీఏల రాష్ట్రస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ అసెంబ్లీ చీఫ్ మార్షల్ ఏడుకొండలురెడ్డి పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన పీఏ దర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పీఏలు ఓర్పు, సహనం కలిగి ఉండాలన సూచించారు. అనంతరం తెలుగు సాహితీ అకాడమీ నుంచి ఆంధ్రరత్న అవార్డు పొందిన ఓఎస్డీ డాక్టర్ ఎం. ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు పీఏలు, పీఎస్‌లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీకి చెందిన షేక్ చాంద్ ఫిబ్రవరి 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.భార్య గౌసియా భర్త కూలీ పనుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లి ఉంటాడని భావించింది. తిరిగి రాకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

భర్త, అతని సమీప బంధువులు భార్య, ఆమె బంధువులపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పొన్నూరుకు చెందిన కృష్ణవేణి, ఆమె తల్లిదండ్రులు కౌన్సెలింగ్ నిమిత్తం దిశ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. పూర్తయిన తర్వాత వారు బయటకు రాగా కృష్ణవేణి భర్త ప్రసాద్, అతని సమీప బంధువులు మధుసూదనరావు, మరికొంత మంది కలసి దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10నుంచి ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఈవెంట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ సుప్రజ, మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మోహన్ తదితరులు

నగరంపాలెం: ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మెగా ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మెగా ఈవెంట్ పోస్టర్‌ను బుధవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ ఎం.మోహన్, ఇంపాక్ట్ గుంటూరు ఇన్‌చార్జ్ చల్లా రవి, డాక్టర్ ఆరుద్ర ఆవిష్కరించారు. సుమారు 1,500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాల్లోని నిపుణులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్‌కు 9494466389 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

గిన్నిస్ బుక్‌లో నాగశ్రీకి స్థానం



వరల్డ్ రికార్డు అవార్డు అందుకున్న నాగశ్రీ వేదప్రణవి

తెనాలి టౌన్: తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన మల్లిశెట్టి నాగశ్రీవేదప్రణవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. అమెరికాలోని టెక్సాస్‌లో గత నెలలో నిర్వహించిన భగవద్గీత మహా పారాయణంలో 10–13 సంవత్సరాల విభాగంలో పాల్గొని బంగారు పతకాన్ని ప్రణవి సాధించింది. విశ్రాంత ఉపాధ్యాయులు, దివంగత మల్లిశెట్టి సుబ్బారావు కుమారుడు మల్లిశెట్టి కుమార్ వ్యాస్, శిరీష దంపతులు అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. వీరి కుమార్తె వేదప్రణవి, గణపతి సచ్చిదానంద స్వామి నుంచి అవార్డు అందుకున్నట్లు వ్యాస్ తెలిపారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరును మోదు చేసుకున్న కొలకలూరు నుంచి మొదటి చిన్నారి కావడం విశేషం. గత ఆరు సంవత్సరాల నుంచి కుమార్ వ్యాస్ దంపతులు అమెరికాలో ఉంటున్నారు. గిన్నిస్ బుక్ రికార్డులో పేరు నమోదు చేసుకోవడంపై వేద ప్రణవిని గ్రామంలోని పలువురు అభినందించారు. అభినందించిన వారిలో గ్రామ మాజీ సర్పంచులు ఉన్నం ఫకీల, వల్లూరు వరప్రసాద్, ఐటీసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, తోట నాగేశ్వరరావు, బండి శ్రీనివాస్, పొన్నెకంటి సాంబశివరావు, మంచికలపూడి వెంకటేశ్వరరావు, తాడిబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

చెరువులో పడిన యువకుడి మృతి



వెంకట శివదుర్గారావు మృతదేహం

పెదకాకాని: చేపలు పడుతూ ఫిట్స్ వచ్చి చెరువులో పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొప్పురావూరులో చోటుచేసుకుంది. పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామానికి చెందిన పల్లా సాంబశివరావు, ధనలక్ష్మి దంపతులకు త్రిభూషణరావు, వెంకట శివ దుర్గారావు సంతానం. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు వెంకట శివ దుర్గారావు 11 సంవత్సరాలుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఏప్రిల్ 30వ తేదీన ఇంటి ముందుకు ఉన్న చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ సమయంలో ఫిట్స్ రావడంతో ముందుకు పడి నీట మునిగాడు. అదే సమయంలో అటు వైపు వెళుతున్న వారు చూసి చెరువులో దూకి బయటకు తీశారు. తండ్రికి సమాచారం అందించడంతో గుంటూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న పల్లా వెంకట శివదుర్గారావు(18) పరిస్థితి విషమించి బుధవారం మరణించాడు. తండ్రి పి.సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

బాకీ డబ్బులు ఇవ్వలేదని దాడి

పెదకాకాని: వడ్డీకి తీసుకున్న డబ్బులు చెల్లించలేదని కొట్టి గాయపరచిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ బాబు బాజీబాబా దర్గా సమీపంలో టైలరింగ్ చేస్తూ, భార్య ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వంశీ వద్ద వారాల లెక్క ప్రకారం చెల్లించే విధంగా 5 వేలు తీసుకున్నారు. వారానికి 500 రూపాయల చొప్పున 12 వారాలు చెల్లించాల్సి ఉంది. ఏప్రిల్ 26వ తేదీ ఊరికి వెళ్ళేందుకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉండగా వంశీ, షేక్ నాగూర్‌బీ అక్కడికి వెళ్ళి ఇంటికి తీసుకొచ్చారు. ఎక్కడికి వెళుతున్నావురా ? అంటూ బూతులు తిట్టడంతో పాటు రాడ్డుతోనూ, కాళ్లతో, చేతులతో కొట్టి గాయపరచారు. అడ్డు వచ్చిన భార్యను కూడా అసభ్యంగా తిట్టారు. బాధితులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం పెదకాకాని పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. బాధితుడు షేక్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఆభరణాల చోరీ

పెదకాకాని: ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు దోచుకు పోయిన ఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. పెదకాకాని కాలనీకి చెందిన మోహన్ దంపతులు మంగళవారం రాత్రి తలుపు గడియ వేయకుండా నిద్రపోయారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బంగారం ఆభరణాలు దోచుకెళ్లారు. బుధవారం ఉదయం ఇంట్లోకి కొత్త వ్యక్తులు వచ్చినట్లు గుర్తించిన ఆ దంపతులు బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని తెలుసుకుని పెదకాకాని పోలీసుల్ని ఆశ్రయించారు.

శ్రీవల్లి అమ్మవారికి లక్ష మల్లెల పూజ

పెదనందిపాడు: నాగులపాడు గ్రామంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం అమ్మవారికి లక్ష మల్లెపూల పూజ ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజ అనంతరం స్వామిని దర్శించుకున్నారు.

అసభ్యంగా మాట్లాడి బెదిరించడంపై కేసు

పెదకాకాని: పొలం వ్యవహారంలో అసభ్యంగా మాట్లాడి బెదిరించడంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన కథనం.. ఉప్పలపాడు గ్రామానికి చెందిన దంతాల గోపాలరావు తన మూడు ఎకరాల భూమిని ఇద్దరు కుమారులు దంతాల నారాయణరావు, వెంకయ్యలకు సమానంగా పంచి పెట్టాడు. పెద్ద కుమారుడు నారాయణరావు గ్రామంలోనే మరొక వ్యక్తికి పొలాన్ని అమ్ముకున్నాడు. రెండో కుమారుడు వెంకయ్య కుమారుడు దంతాల వెంకట తిరుమల పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ పొలంపై అమెరికా వెళ్లి చదువుకునేందుకు బ్యాంకు రుణం కూడా పొందారు. వెంకయ్య చనిపోవడంతో ఆయన భార్య వాసంతి ఆ పొలాన్ని గట్టినేని తేజకు కౌలుకు ఇచ్చి కుమారుడు వెంకట తిరుమల వద్దకు వెళ్లింది. ఆ తరువాత కొద్దిరోజులకే వాసంతి బావ నారాయణరావు, ఆయన కుమారుడు శ్రీకాంత్ పొలంలోకి చేరుకుని పైరును ట్రాక్టర్‌తో దున్ని స్వాధీనం చేసుకున్నారు. తేజ ద్వారా సమాచారం అందుకున్న వాసంతి తిరిగి ఉప్పలపాడు చేరింది. పొలం వద్ద ఉన్న బావ(పెద్ద మేనమామ), ఆయన కుమారుడు శ్రీకాంత్‌లను ఇదేమని నిలదీయడంతో అసభ్యంగా తిట్టడంతో పాటు బెదిరిస్తున్నారని బాధితురాలు వాసంతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

జూన్ ఒకటి నుంచి మహాకుంభాభిషేకం

పెదకాకాని: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో జూన్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు మహా కుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానంలో పీఠాధిపతుల పర్యవేక్షణలో మహా కుంభాభిషేకానికి రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణను బుధవారం ఆహ్వానించారు. ఆలయ ప్రాంగణంలో మహా కుంభాభిషేకం క్రతువుకు సంబంధించిన పనుల్ని చేపట్టనున్నట్లు ఏసీ తెలిపారు.

నల్లపాడు పోలీస్ స్టేషన్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ బాషా

గుంటూరు రూరల్: సౌత్ జోన్ డీఎస్పీ మహమ్మద్ మహబూబ్ బాషా బుధవారం అడవితక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నేరాలు, శాంతి భద్రతలను గురించి విచారించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరస్తుల కదలికలపై నిత్యం నిఘాను పెంచాలని సిబ్బందికి సూచించారు. నిషేధిత ఉత్పత్తుల విక్రయాలు, అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన కూడళ్ళలో సీసీ కెమెరాలు నిఘాలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం



మంత్రి నాగార్జునను సన్మానిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో ప్రభుత్వం అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని అంబేడ్కర్ భవన నిర్మాణ సాధన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అంబేడ్కర్ భావజాలానికి అనుగుణంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున విగ్రహం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గుంటూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా అంబేడ్కర్ విగ్రహం రాష్ట్రంలో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. మంత్రిని కలసిన వారిలో నల్లపు నీలాంబరం, జొన్నలగడ్డ శ్రీకాంత్, బండ్లమూడి స్టాలిన్, గుడిపూడి బాబు, జెర్రిపోతుల రాజు, డేవిడ్ విలియమ్స్, కనకవల్లి వినయ్ ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ సౌజన్య, సీఐ నిసార్ బాషా, ఎస్ఐ హరిబాబు

పట్నంబజారు: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా ప్రైవేట్ బస్సులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలపకూడదని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ నిసార్ బాషా, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సౌజన్య స్పష్టం చేశారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నిసార్ బాషా, ఎంవీఐ సౌజన్య మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌కు కిలోమీటర్ అవతల మాత్రమే ప్రయాణికుల్ని ఎక్కించుకోవడం, దించటం వంటివి చేయాలని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించమని హెచ్చరించారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

ఈ– చలనాలు చెల్లించాలి

ఈస్ట్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఈ– చలనాల పెండింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. తప్పనిసరిగా ప్రతి వాహనదారుడులు పెండింగ్‌లో ఉన్న చలనాలు కట్టాలని, లేని పక్షంలో వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

తానా సభలకు ప్రత్యేక అతిథిగా శివాజీకి ఆహ్వానం



శివాజీకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న తానా నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: యూఎస్ఏ పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా నగరంలో జూలై 7,8,9 తేదీల్లో నిర్వహించనున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘ (తానా) సభలకు ప్రత్యేక అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీకి ఆహ్వానం అందింది. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన నివాసంలో తానా కాన్ఫరెన్స్ కో–ఆర్డినేటర్ రవి పొట్లూరి, డైరెక్టర్ వంశీ కోట, సుబ్రహ్మణ్యం, వెంకట్ సింగ్ తదితరులు కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూలు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ పాలేటి తేజస్వి, ప్రైమరీ, సెకండరీ కో–ఆర్డినేటర్లు పార్వతీదేవి, దుర్గా శ్యామ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నేతలు

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో బుధవారం విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, జగనన్న పాలవెల్లువ మహిళా డైయిరీ కేంద్రం నూతన భవనాలు, సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని జగనన్న సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కార్యక్రమం పేదలకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు మహిళా డెయిరీలు దోహదపడతాయన్నారు. తురకపాలెంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మాణం గతంలో జరిగిందని, నేడు రూ.93 లక్షలతో రైతు భరోసాకేంద్రం, విలేజ్ క్లినిక్, మహిళా డెయిరీలను నిర్మించి, ప్రారంభించినట్లు చెప్పారు. రూ. 28.16 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి డబ్బూరి సూర్యప్రకాశరావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి, కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, పార్టీ మండల కన్వీనర్ ఆళ్ళ రవిదేవరాజు, సొసైటీ చైర్మన్ దుగ్గెంపూడి భూపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, భాస్కర్, శ్రీనివాసరావు, మెట్టు వెంకటప్పారెడ్డి, తంగెళ్ళ నాగేశ్వరరావు, దాసరి నాగరాజు, రామకోటేశ్వరరావు, ఎదురుపాక వెంకట్, ఎంపీడీఓ శోభారాణి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఏవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కంచర్ల రఘుకు బల్లాల్ అవార్డు



కంచర్ల రఘు వీర మణికంఠచారి

పొన్నూరు(చేబ్రోలు): అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్, ఇంటర్నేషనల్ గ్యాస్ టర్బైన్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ టర్బైన్ రంగంలో విశేష కృషి చేసిన యువ శాస్త్రవేత్తలకు ప్రదానం చేసే దిలీప్.ఆర్.బల్లాల్ అవార్డు తెలుగు శాస్త్రవేత్త పొన్నూరుకు చెందిన డాక్టర్ కంచర్ల రఘు వీర మణికంఠచారిని వరించింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పోటీ ఉండే ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఏటా ఒక్కరిని ఎంపిక చేస్తారు. పొన్నూరు పట్టణం పాత పొన్నూరుకు చెందిన అయ్యప్ప గురుస్వామి కంచర్ల ధనుంజయాచారి కుమారుడు మణికంఠ. పట్టణంలోని ఐడియల్ కాన్వెంట్‌లో ఇంటర్ వరకు విద్యనభ్యసించిన మణికంఠ, చెన్నై ఐఐటీలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసుకుని అనంతరం అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని పవర్ సిస్టమ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఐడియల్ పూర్వ విద్యార్థికి అవార్డు రావడంపై కాన్వెంట్ ప్రిన్సిపాల్ రావులపల్లి ఉషారాణి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల ప్రారంభం

కొమ్మూరు(కాకుమాను): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి నిర్మాణ పనులకు జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, సర్పంచి గేరా జ్యోతి భూమి పూజ చేశారు. గుల్జార్ బేగం మాట్లాడుతూ నాడు– నేడు ఫేజ్ ద్వారా పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.33 లక్షల వ్యయంతో మూడు అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి గేరా జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు గేరా పున్నారావు,ముజావర్ షేక్ అసదుల్లా, వైస్ సర్పంచి, పీఎంసీ చైర్మన్ షేక్ జిలేఖ, హెచ్‌ఎం. శ్రీనివాసరావు, తన్నీరు సుబ్బారావు పాల్గొన్నారు.